క్లుప్తంగా

రైతులకు న్యాయం చేస్తాం

- ఆర్డీవో పవన్‌కుమార్



చెక్‌డ్యాంను పరిశీలిస్తున్న ఆర్డీవో పవన్‌కుమార్

వేములవాడరూరల్: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతుల వివరాలను జిల్లా అధికారులకు నివేదిక అందజేసి న్యాయం చేస్తామని వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ రైతులకు మనోధైర్యం కల్పించారు. మండలంలోని జయవరం, మల్లారం గ్రామాల్లో తెగిపోయిన చెక్‌డ్యాంలు, కల్వర్టులను తహసీల్దార్ విజయలలితతో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల రైతులు ఆర్డీవోకు నష్టాల వివరాలను వివరించారు. ఆయనతో పాటు ఇరిగేషన్ ఏఈ రాజు, సర్పంచ్ పండుగ తిరుపతి, రైతులు పాల్గొన్నారు.

అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలి



హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న డీఈవో

చందుర్తి: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలని డీఈవో రమేశ్‌కుమార్ కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేసి, విద్యా బోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని ఆదేశించారు. అలాగే మన ఊరు.. మన బడి పనులను పరిశీలించి, వెంటనే పూర్తి చేయాలన్నారు. ఈయన వెంట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బోయినపల్లి తిరుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

వరద నష్టంపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న అధికారులు

కోనరావుపేట: మండల పరిషత్ కార్యాలయంలో వరద వల్ల జరిగిన నష్టంపై ఎంపీపీ చంద్రయ్య అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని గ్రామాల్లో భారీ వర్షాలకు జరిగిన నష్టాలను అంచనా వేశారు. అన్ని గ్రామాల్లో కలిపి మొత్తం 539 ఎకరాలలో పంట నష్టం జరిగిందని, అందులో 439 ఎకరాలలో ఇసుక మేటలు వేసిందన్నారు. అన్ని గ్రామాల్లో 29 ఇళ్లు కూలాయని, మొత్తం మీద సుమారు రూ.వంద కోట్లు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. బావుసాయిపేటలో ప్రైవేట్ వ్యక్తి పెట్టిన ఇసుక రీచ్ కారణంగా పెద్ద ఎత్తున నష్టం ఏర్పడిందన్నారు. ఇసుక రీచ్‌ను తొలగించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికాంత్, ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారి వేణుమాధవ్, ఏవో వెంకట్రామమ్మ, సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, సెస్ ఏఈ దివ్య, ఏఈ సాగర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయండి



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

వేములవాడ: ఈనెల 9, 10 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ల ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు పిలుపునిచ్చారు. స్థానిక అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎల్ల దేవరాజు, డప్పు శీను, పండుగ పోచమల్లు, గాజుల దేవయ్య, జంగం మల్లేశం, ఆరెల్లి మల్లేశం, తుమ్మ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎంపీడీవో వైఖరికి నిరసనగా ఎంపీటీసీ రాజీనామా.?

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల గ్రామంలో హరితహారం కార్యక్రమంపై ఎంపీడీవో మీర్జా మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్లు, ఇతర శాఖల సిబ్బందితో సమీక్ష నిర్వహించడం జరిగిందని, కనీసం ఎంపీడీవో ప్రోటోకాల్ పాటించకుండా తనకు సమాచారం ఇవ్వలేదని, తన పదవికి విలువ ఇవ్వనప్పుడు పదవి తనకు వద్దని, బుధవారం తన ఎంపీటీసీ పదవికి రాజీనామా చేయనున్నట్లు ఎంపీటీసీ నాయిని స్రవంతి తెలిపారు.

అసౌకర్యాల కళాశాల

- విద్యార్థులకు మరుగుదొడ్ల కరువు
- కనీస వసతులకు నోచుకోని విద్యాలయం
- అధ్యాపక పోస్టులే కాదు.. ప్రిన్సిపాల్ పోస్టు ఖాళీయే
- ప్రహరీ లేక ఇబ్బందులు



ముస్తాబాద్: పక్కన మీరు చూస్తున్న ఫొటో ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల. ఒకప్పుడు ఎంతో పేరు గడించిన ఈ కళాశాలను పట్టించుకునే వారు లేక ప్రాభవాన్ని కోల్పోతోంది. కళాశాలలో అసౌకర్యాలు రాజ్యామేలుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం ప్రారంభమైన పాత సమస్యలే విద్యార్థులను, అధ్యాపకులను వెంటాడుతున్నాయి. కనీస సదుపాయాలు కరువైన కళాశాలలో ఎలా చదివేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఒకప్పుడు 500 మంది విద్యార్థులతో కళకళలాడిన కళాశాల నేడు 200 విద్యార్థుల స్థాయికి పడిపోయింది. కళాశాలలో కనీస వసతులు కల్పించి, ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.



వర్షానికి కళాశాల గేటు ఎదురుగా గుంతలలో వరద నీరు, కళాశాల భవనం (ఇన్‌సెట్‌లో)

ప్రహరీ లేక తిప్పలు..

ప్రభుత్వ జూనియర్ కళాశాల సువిశాలమైన ప్రదేశంలో రెండు పెద్ద భవనాలను నిర్మించారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో ఫర్నీచర్, అదనపు గదులను నిర్మించారు. అయితే కళాశాల ప్రహరీ పనులు పూర్తి చేయలేదు. మరో 160 మీటర్ల కాంపౌండ్ వాల్ నిర్మిస్తే కళాశాలలోకి పశువులు, మేకలు, గొర్రెలు రావు. ముఖ్యంగా రాత్రివేళల్లో మందుబాబులకు అడ్డాగా ఉన్న కళాశాలకు అత్యవసరంగా ప్రహరీని నిర్మించాల్సి ఉంది. కొంతమంది విద్యార్థులు ప్రహరీ లేక మధ్యలోనే తరగతులు వదిలి వెళ్తున్నారు. ఇలాంటి వారిని కట్టడి చేయలేక పోతున్నామని అధ్యాపకులు అంటున్నారు. అలాగే కళాశాల మెయిన్ గేటు ఎదురుగా వరద నీరు ఉధృతికి ఒర్రెను తలపిస్తోంది. ఈ వానకాలంలో విద్యార్థులు బురద నీటిని దాటుకుని వెళ్లాల్సి వస్తోంది. అలాగే కళాశాల ఆవరణలో పెద్ద బండరాళ్లు, చెట్లు అడవిని తలపిస్తున్నాయి. ఒకవైపు మైదానాన్ని చదును చేయాల్సి వుంది.

ఒకటి, రెంటికి ఆరుబయటే..

కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రస్తుతానికి 96 మంది అడ్మిషన్ తీసుకున్నారు. మరో 30 మంది వరకు రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక రెండో సంవత్సరంలో 106 మంది విద్యార్థులు ఉన్నారు. ముఖ్యంగా బాలురకు మరుగుదొడ్లు లేకపోవడంతో వారు ఒంటికి, రెంటికి ఆరుబయటకు వెళ్తున్నారు. మరుగుదొడ్లు లేకపోవడంతో కొంత మంది ఇళ్లకు వెళ్తున్నారు. ఇక బాలికల మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటికి రక్షణ లేకపోవడంతో బయటివారు సైతం వస్తున్నారని అధ్యాపకులు పేర్కొన్నారు. అవికూడా మరమ్మతుకు గురయ్యాయి. పాత తరగతి గదుల్లో ఫ్యాన్లు లేవు. ఎండకాలంలో విద్యార్థులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు.



అడవిని తలపిస్తున్న కళాశాల ప్రాంగణం

ఖాళీ పోస్టులతో చదువులు

సిరిసిల్ల కళాశాలకు చెందిన సీనియర్ అధ్యాపకులు దీటి దేవయ్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకానమిక్స్ లెక్చరర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతానికి అతిథి అధ్యాపకులతో క్లాసులు నిర్వహిస్తున్నారు. ఇక ఫిజికల్ డైరెక్టర్ పోస్టు ఏళ్లుగా ఖాళీగానే వుంది. విద్యార్థులకు ఆటలు ఆడించే వారు కరువయ్యారు. లైబ్రేరియన్ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. సెకండ్ ఇయర్ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ ఇయర్‌లో 67 శాతం ఉత్తీర్ణత సాధించగా బోధనపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి



మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నాం. అర్జంట్‌గా బాయ్స్‌కు మరుగుదొడ్లు కట్టాలి. కొంతమంది టాయిలెట్స్‌కని బయటకు వెళ్తున్నారు. ప్రహరీ కూడా కట్టాలి. మైదానం చదును చేస్తే ఆటలు ఆడుకునే అవకాశం ఉంది.

– జంగిటి అనిల్, ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి

పోస్టులను భర్తీ చేయాలి



ముస్తాబాద్ కళాశాలకు మంచి పేరు ఉంది. ఖాళీగా వున్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి. విద్యార్థులకు టాయిలెట్స్ లేక ఇబ్బంది పడుతున్నారు. రక్షణ లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది.

– ధరంసోత్ ప్రకాశ్‌నాయక్, ఏబీవీపీ నాయకుడు

సమస్యలను నివేదించాం



ముస్తాబాద్ కళాశాలలో నెలకొన్న సమస్యలపై అధికారులకు నివేదించాం. ప్రహరీ కోసం ప్రతిపాదనలు చేశారు. గెస్టు లెక్చరర్లు ముగ్గురు జాయిన్ అవుతున్నారు. కనీస సౌకర్యాల కోసం స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిపాం.

– దీటి దేవయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

తిమ్మాసికుంటను శాశ్వత మరమ్మతు చేస్తాం

- ఇరిగేషన్ డీఈఈ సత్యనారాయణ
- గండి పడ్డ కుంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని కిషన్‌దాస్‌పేట శివారులోని తిమ్మాసికుంటను శాశ్వతంగా మరమ్మతు చేయడానికి ప్రతిపాదనలు రూపొందించి నిధుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని నీటి పారుదల శాఖ డీఈఈ సత్యనారాయణ అన్నారు. 'సాక్షి' దిన పత్రికలో మంగళవారం ప్రచురితమైన 'రైతు గుండెపై ఇసుక మేట' అనే కథనానికి అధికారులు స్పందించారు. గండి పడిన తిమ్మాసికుంటను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. భారీ వర్షాలతో ఉధృతంగా వరద నీరు వచ్చి కట్ట తెగిపోవడం జరిగిందన్నారు. కట్ట తెగిన ప్రాంతాన్ని, దిగువన ఉన్న దెబ్బతిన్న వరి పంట పొలాలను పరిశీలించామన్నారు. ప్రకృతి వైపరీత్యాల నిధుల నుంచి కల్వర్టును ఏర్పాటు చేసే విధంగా ప్రతిపాదనలు చేసి ముందుగా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామన్నారు. ఆయకట్టు రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయంత్‌కుమార్, ఆర్‌ఐ సంతోష్, ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, మాజీ ఎంపీటీసీ బాల్‌రాజ్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.



తెగిన గండిని పరిశీలిస్తున్న అధికారులు

విన్నపాలు వినవలె..





తంగళ్లపల్లి, గంభీరావుపేటలో వినతిపత్రాలు అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

తాత్కాలిక కార్మికులను పెట్టి తమను అవమానించవద్దని కోరుతూ మంగళవారం జిల్లాలోని అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో ఆయా మండలాల పంచాయతీ కార్మికులు వినతిపత్రాలు సమర్పించారు. మంగళవారం సమ్మె శిబిరాల నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం వినతిపత్రాలు అందించారు. తాము 27 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే పట్టించుకోకుండా ప్రైవేట్ వ్యక్తులతో పనులు ఎందుకు చేయిస్తున్నారని, వెంటనే పనులను నిలిపివేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె కొనసాగినంతకాలం పోటీ కార్మికులను నియమించవద్దని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మోర అజయ్‌తో పాటు నాయకులు పాల్గొన్నారు. - ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి/ఇల్లంతకుంట/గంభీరావుపేట/వీర్నపల్లి

జగిత్యాలలో ఆత్మహత్య సిరిసిల్లలో విషాదం

- సిరిసిల్ల వస్త్రవ్యాపారి బలవన్మరణం

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన వస్త్రవ్యాపారి గాజుల నరహరి(45) జగిత్యాలలో మంగళవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడడం సిరిసిల్లలో విషాదం నింపింది. నరహరి పాతికేళ్ల కిందటే జగిత్యాలకు వెళ్లి స్థిరపడ్డారు. అక్కడే వస్త్రవ్యాపారం చేస్తూ కృష్ణానగర్‌లో ఇల్లు కట్టుకున్నారు. నరహరి షటిల్ ఆటగాడిగా జగిత్యాల, సిరిసిల్లలో సుపరిచితుడు. జగిత్యాల టౌన్ క్లబ్ కోశాధికారిగా పనిచేస్తున్న ఆయన కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులకు గురైనట్లు సమాచారం. పది రోజులుగా టౌన్ క్లబ్‌లో రాత్రి వరకు ఉంటూ మానసిక వేదనకు గురైనట్లు తెలిసింది. మంగళవారం ఉదయం 7.35 గంటలకు జగిత్యాల టౌన్ క్లబ్‌లోకి తాడుతో వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ప్రస్తుతం కూతురు లండన్‌లో ఉన్నారు. ఆమె ఇండియాకు వచ్చిన తరువాత అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సిరిసిల్ల వస్త్ర వ్యాపారి నరహరి జగిత్యాలలో బలవన్మరణానికి పాల్పడడం సిరిసిల్లలోని ఆయన కుటుంబ సభ్యుల్లో విషాదం నింపింది. ఆయన సన్నిహితులను కలచివేసింది.



గాజుల నరహరి(ఫైల్)

'గోవర్ధన్‌గౌడ్‌పై కేసులు ఎత్తివేయాలి'



మద్దతు తెలుపుతున్న సంఘం నాయకులు

ఎల్లారెడ్డిపేట: గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్‌పై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని మండలంలోని బొప్పాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీసీ సంఘం నాయకుడు పర్శ హన్మాండ్లు తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని కోరారు. గ్రామంలోని అనేక అభివృద్ధి పనులను తన సొంత డబ్బుతో చేశారని గుర్తు చేశారు. బొమ్మనవేని కృష్ణ, కిషన్, సత్యం, నర్సయ్య, అశోక్, మైసయ్య, లక్ష్మణ్, దేవయ్య, పర్శరాములు, సతీశ్ పాల్గొన్నారు.

గౌడ సంఘాలు మద్దతు

ఎల్లారెడ్డిపేట: మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌గౌడ్‌కు మంగళవారం జిల్లాలోని వివిధ గ్రామాల గౌడ సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు మద్దతు తెలిపారు. హైదరాబాద్‌లోని తన నివాసానికి వెళ్లి ఎప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

రగుడు చౌరస్తాలో రోడ్డు ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న ముందుభాగం

సిరిసిల్లక్రైం: హైదరాబాద్ నుంచి వేములవాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న బైక్ మంగళవారం ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాలు. హైదరాబాద్‌లో ఆస్పత్రికి వెళ్లి తిరిగి వేములవాడకు వెళ్తున్న కారును తంగళ్లపల్లి చెందిన ప్రేమ్‌కుమార్ వేములవాడకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. కారు ముందు భాగం దెబ్బతింది. తీవ్రంగా గాయపడ్డ బైక్ నడుపుతున్న ప్రేమ్‌కుమార్‌ను సిరిసిల్ల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మరిమడ్లలో దొంగతనం

కోనరావుపేట: మండలంలోని మరిమడ్లలో మంగళవారం దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన తిక్క భూంరాజు వ్యవసాయపనులకు ఇంటికి తాళం వేసి వెళ్లాడు. సాయంత్రం ఇంటికొచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా అర తులం బంగారం, రూ.5 వేల నగదు కనిపించలేదు. దీంతో కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపడుతున్నారు.

సంక్షిప్త వార్తలు

డ్రై డే పాటిస్తేనే వ్యాధులు దూరం

చందుర్తి: మండలంలోని మల్యాలలో మంగళవారం డ్రై డే నిర్వహణను డీఎంహెచ్‌వో సుమన్ మోహన్ రావు తనిఖీ చేశారు. ఇంటి ఆవరణలోని కుండీలు, టైర్లలో ఉన్న నీటి నిల్వలను పారబోయించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు, చందుర్తి మెడికల్ ఆఫీసర్ సంపత్, వైద్య సిబ్బంది లింగం, మహేశ్, ఏఎన్‌ఎం పద్మ ఉన్నారు

కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కు గేటు ఎదుట మంగళవారం బీఆర్‌ఎస్ నాయకుడు సిలివేరి చిరంజీవి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

సిరిసిల్లఅర్బన్/బోయినపల్లి/తంగళ్లపల్లి: సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడులో, బోయినపల్లి మండలంలోని విలాసాగర్, తంగళ్లపల్లి మండలంలోని గోపాల్‌రావుపల్లె గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరం మంగళవారం ప్రారంభించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో కరెడ్ల లతకు రూ.50 వేలు, పాగుల దుర్గయ్యకు రూ.19 వేలు, ఊరడి ప్రదీప్‌కు రూ.14 వేలు, చిన్ని రాజిరెడ్డికి రూ.15 వేల విలువైన చెక్కులను ఎంపీటీసీ సవిత, ఉపసర్పంచ్ గున్నాల నాగరాజు అందజేశారు.

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గొల్లపల్లి రాజు ఆధ్వర్యంలో మంగళవారం దోమకొండ వెన్నెల రూ:21 వేలు, న్యాత లక్ష్మీరాజం రూ.13 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

రాజశ్రీ పెరటి కోడి పిల్లలు పంపిణీ

తంగళ్లపల్లి: బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల జిల్లెల్ల దత్తత గ్రామం రాళ్లపేటలో మంగళవారం రైతులకు 5 వారాల రాజశ్రీ రకం పెరటి కోడి పిల్లలను పంపిణీ చేశారు.

దోమల మందు పిచికారీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం కేసీఆర్ కాలనీలో మంగళవారం పంచాయతీ సిబ్బంది దోమల నివారణకు మందును పిచికారీ చేశారు.

తల్లిపాల వారోత్సవాలు

వేములవాడరూరల్: అంగన్‌వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలను సూపర్‌వైజర్ నిర్మలాదేవి ప్రారంభించారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

వేములవాడరూరల్: మండల కేంద్రంలో ఉన్న భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగులకు డా.మయూరి ఫిజియోథెరపీ నిర్వహించారు.

గాంధీ ఏరియాలో మురుగు నీరు

కోనరావుపేట: మండల కేంద్రంలోని గాంధీనగర్ ఏరియాలో నల్లాల ద్వారా మురుగునీరు సరఫరా కావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నీటిని వినియోగించడం వల్ల దురద తయారవుతుందని వాపోతున్నారు.

పరామర్శ

ఇల్లంతకుంట: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గూడ సందీప్‌రెడ్డి అనే యువకుడు ఇటీవల మృతి చెందగా మృతుడి కుటుంబ సభ్యులను కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం పరామర్శించారు.

బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలి

గంభీరావుపేట: మండల కేంద్రంలోని కేజీ టు పీజీ ప్రాంగణానికి అనుబంధంగా బీసీ హాస్టల్ ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హమీద్ అధికారులను కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ యూనిట్లు

ముస్తాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు స్త్రీనిధి ఆర్‌ఎం సతీశ్ అన్నారు. మోహినికుంటలో రూఫ్‌టాప్ సోలార్ ఉత్పత్తిపై మంగళవారం అవగాహన కల్పించారు. సర్పంచ్ వనజ, ఉపసర్పంచ్ సంధ్య, ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మీకాంత్, డీఎం పరమాచారి, పాల్గొన్నారు.

అత్యవసర వేళల్లో విద్యుత్ సేవలు

ముస్తాబాద్: భారీ వర్షాలకు మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డ సమాచారం అందుకున్న సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి పనిచేసి కరెంట్ సరఫరాకు చర్యలు తీసుకున్నారు.

సమ్మెకు మద్దతు

బోయినపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి మద్దతు తెలిపారు.

నియామకం

బీఆర్‌ఎస్ బూత్ కమిటీ

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి గ్రామంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వలకొండ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. నాలుగు బూత్‌లకు అధ్యక్షుడిగా బండి భాస్కర్, పెద్ది రాజు, యాస సందీప్, పెద్ది వెంకటేశ్ ఏకగ్రీవమయ్యారు. కార్యక్రమంలో రైతు సెల్ అధ్యక్షుడు మహిమల మోహన్‌రెడ్డి, సర్పంచ్ గనప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, ఉపసర్పంచ్ నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక మేటలే మిగిలాయి



పొలంలో ఇసుక మేటలను చూపుతున్న రైతులు

ముస్తాబాద్: భారీ వర్షాలతో తమ పంట పొలాల్లో ఇసుక మేటలే మిగిలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె, ఆవునూర్, కొండాపూర్, తుర్కపల్లి, గూడెం గ్రామాల్లో వ్యవసాయాధికారులు పంట నష్టంపై మంగళవారం సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా పలు గ్రామాల్లో పంట భూముల్లో వేసిన ఇసుక మేటలను అధికారులకు చూపారు. తుర్కపల్లిలో భారీ వరదలతో పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయని రైతులు అధికారులు చూపారు. భారీ నష్టం జరిగిందని, ప్రభుత్వం ఎకరానికి రూ.20వేల నష్ట పరిహారం అందించాలని కోరారు. ఏఈవో ప్రదీప్, సర్పంచులు కాశోల్ల పద్మ, రవీందర్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

కోనరావుపేట: నూతనంగా ఏర్పాటైన గిరిజన గ్రామపంచాయతీల సమస్యలు పరిష్కరించాలని లంబాడీ హక్కుల ఐక్య వేదిక (లైవ్) జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్ అన్నారు. బురదమయంగా మారిన హనుమాన్‌తండా రోడ్డుపై మంగళవారం నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడారు. జైసేవాలాల్ భుక్యారెడ్డితండా సమీపంలోని హనుమాన్, బానోత్ తండాల రహదారి బురదమయంగా మారి నడవడానికి వీలు లేకుండా మారిందన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు దేవేందర్, మోహన్, సాగర్, గంగాధర్ ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై ఉద్యమించాలి

సిరిసిల్లఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనపై ఉద్యమించాలని బీజేవైఎం జిల్లా ఇన్‌చార్జి దూలం వెంకట్‌గౌడ్ అన్నారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను మోసం చేస్తోందని, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పి ఇప్పటికీ హామీని నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బూర విష్ణు, ఉపాధ్యక్షుడు పర్శరామ్ గౌడ్, నరేశ్, కార్యదర్శి వంగ అనిల్‌కుమార్ గౌడ్, కోశాధికారి మహేశ్, అధికార ప్రతినిధి నాగరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కబ్జా

ముస్తాబాద్: మండలంలోని సేవాలాల్‌తండాలో ప్రభుత్వ భూములను యథేచ్ఛగా అక్రమిస్తున్న రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టడం లేదని బంజారా సంఘం మండల అధ్యక్షుడు నర్సింలు నాయక్ ఆరోపించారు. అసైన్డ్ భూములను డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతువేదిక, ప్రగతిభవన్ నిర్మించేందుకు గతంలో అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. ఇప్పుడు కొంతమంది తమ స్వార్థం కోసం అసైన్డ్ భూములను కబ్జా చేస్తున్న ఏ అధికారి ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఈ విషయంలో చర్యలు తీసుకోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

సిరిసిల్లలో అనుమానితుల సంచారం ?



సిరిసిల్లక్రైం: సిరిసిల్లలో అనుమానితులు సంచరిస్తున్నట్లు సోషల్‌మీడియాలో ఫొటోలు వైరల్‌గా మారాయి. స్థానికులు తెలిపిన వివరాలు. మంగళవారం చీకటి పడ్డ తర్వాత దాదాపు గంటపాటు స్థానిక బీవైనగర్‌లోని కోతిబొమ్మచౌరస్తా వద్ద అనుమానితులు సంచరించారు. చిన్నపిల్లలకు ఏదో ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ప్రచారమైంది. వారు బైక్‌పై సుందరయ్యనగర్ వైపు వెళ్లినట్లు అనుమానిస్తున్నారు. సీసీ ఫుటేజీల్లోని దృశ్యాలు స్పష్టంగా లేకపోవడంతో వారిని గుర్తుపట్టలేకపోతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా: 9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899